ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★ మంగళవారం 16 ఏప్రిల్ 2024



నత్తనడకన బండలవాగు ప్రాజెక్టు పనులు 8లో..

8లో.. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



కలెక్టరేట్‌లో భద్రత ఏర్పాట్ల గురించి ఏసీపీకి సూచనలు ఇస్తున్న కలెక్టర్

నామినేషన్ల స్వీకరణకు సన్నద్ధం

- ఈ నెల 18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్
- అదే రోజు నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఎన్నికల అధికారిగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఈ నెల 18వ తేదీన పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో అదేరోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. ఈ మేరకు నామినేషన్ల స్వీకరణకు అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతున్నది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఎన్నికల అధికారిగా వ్యవహరిం చనుండడంతో నామినేషన్లను పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలోనే స్వీకరించనున్నారు. ఇందుకు గాను కలెక్టరేట్‌లో భద్రతా పరమైన చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణతో కలిసి భద్రతా చర్యల గురించి సోమవారం చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే అదనపు కలెక్టర్లు జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, జెల్ల అరుణశ్రీతో కలిసి అధికార యంత్రాంగంతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల సందర్భంగా అనుసరించాల్సిన విధానాల గురించి చర్చించారు.

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నాలుగు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలు పెద్దపల్లి జిల్లాలో, మంథని నియోజకవర్గం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో, ధర్మపురి జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో ఉంది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలు మంచిర్యాల జిల్లాల్లో ఉన్నాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,94,392 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 7,87,140, మహిళలు 8,05,755, థర్డ్ జెండర్ 101 మంది, సర్వీస్ ఓటర్లు 1,396 మంది ఉన్నారు. అత్యధికంగా పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,56,640 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,75,508 మంది ఓటర్లున్నారు. పెద్దపల్లి నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి 17 సార్లు ఎన్నికలు జరగగా, ప్రస్తుతం జరగబోయే ఎన్నిక 18వసారి కావడం గమనార్హం.



ఎన్నికల ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వంద మీటర్ల దూరంలో పోలీస్ బందోబస్తు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నామినేషన్ల సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఛాంబర్ నుంచి వంద మీటర్ దూరంలో పోలీస్ బందోబస్తు ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఏసీపీ గజ్జి కృష్ణను ఆదేశించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే వారిని వంద మీటర్ల అవతలనే నిలువరించాలని, అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ సాఫీగా సాగేందుకు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సహకరించాలని కోరారు.

● 18 నుంచి నామినేషన్ల స్వీకరణ..

ఈ నెల 18వ తేదీ నుంచి 25 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. ఉపసంహరణలకు 29వ తేదీ వరకు గడువు విధించారు. మే 13వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనున్నది. జూన్ 4వ తేదీన దేశ వ్యాప్తంగా కౌంటింగ్ జరగనున్నది. ఈ నియోజకవర్గం నాలుగు జిల్లాల పరిధిలో ఉండడంతో పార్లమెంట్ కేంద్రం పెద్దపల్లి కావడంతో పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఒకరోజు ముందు అభ్యర్థులు కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలన ప్రారంభానికి ముందే అఫిడవిట్ కరెక్షన్స్ డిపాజిట్ సొమ్ము, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలనకు ఒక రోజు ముందే అభ్యర్థి ప్రతిజ్ఞ తీసుకోనున్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫారం 2ఏతో పాటు అఫిడవిట్ సమర్పించాలి. అభ్యర్థుల ప్రతిపాదకులు తప్పనిసరిగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఓటర్లుగా ఉండాలి. అభ్యర్థి వయసు, కులం వివరాలు నామినేషన్ పేపర్‌పై నమోదు చేయాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీల తరఫున నమోదు చేసే అభ్యర్థులు వారి డిక్లరేషన్ ఫారం సమర్పించాలి. అభ్యర్థి అఫిడవిట్‌ను ఫారం 26లో పార్టీ పేరు, పార్లమెంటరీ నియోజకవర్గం పేరు, రాష్ట్రం పేరు, ఓటరు జాబితాలో పార్ట్ క్రమసంఖ్య వివరాలు, పెండింగ్ క్రిమినల్ కేసుల వివరాలు, ఆస్తుల వివరాలు, అప్పుల వివరాలు, వృత్తి, విద్యార్హతలు, తదితర వివరాలను నమోదు చేయాలి. అభ్యర్థి దాఖలు చేసిన అఫిడవిట్లో ప్రతి పేజీపై అభ్యర్థి సంతకం చేయడంతో పాటు అఫిడవిట్ నోటరీ చేయాలని లేదా కమిషనర్/ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలని, అభ్యర్థి ఫొటో సాఫ్ట్‌కాపీ, హార్డ్‌కాపీ తీసుకోవాల్సి ఉంటుంది. నామినేషన్ తీసుకున్న తర్వాత రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అఫిడవిట్‌లో అన్ని కాలంలు నింపి ఉన్నాయా, ధ్రువీకరించిన ఓటరు జాబితా కాపీ (అభ్యర్థి ఇతర నియోజకవర్గ ఓటర్), ఫారం ఏ, ఫారం బీ, కుల ధ్రువీకరణ పత్రం, డిపాజిట్, ప్రతిజ్ఞ అంశాలను పరిశీలించి చెక్ లిస్టు జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు వివరించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సహాయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

పద్మశాలి కులస్తుల అభివృద్ధి కోసం కృషి

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 15: పద్మశాలి కులస్తుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఠైటింక్లయిన్‌కాలనీ అధ్యక్షుడు, పద్మశాలి జిల్లా సేవా సంఘం ఉపాధ్యక్షుడు గుండెటి రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పద్మశాలీ సేవా సంఘం, పోపా, మహిళా సంఘం, యువజన సంఘం ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండారు రాయమల్లు, బూర్ల దామోదర్‌తో పాటు టీడీపీ, బీఆర్ ఎస్‌లకు చెందిన సీనియర్ నాయకులు అనుమ రాజమల్లు, గుండేటి శంకర్, సిరిమల్ల జయరాములు, సిరిపురం మాణిక్యం, తాటికొండ రవీందర్, కానుగంటి నారాయణ, కన్నం ప్రభాకర్‌లతో పాటు 200మంది సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీ సేవా సంఘం అభివృద్ధి కోసం చూస్తానని, సేవా సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో పద్మశాలి వ్యాపారస్తుల కోసం, వారి అభివృద్ధి కోసం ప్రభుత్వపరంగా సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా అధ్యక్ష, కార్యదర్శులు బందారి రాజమల్లు, బూర్ల దామోదర్, పోపా నాయకుడు వడ్డేపల్లి దినేష్, మహిళా సంఘం నాయకురాలు మాటేటి మౌనిక, యువజన సంఘం నాయకులు మాటేటి సతీష్, వేణు, సంఘం, కాంగ్రెస్ నాయకు లు వెంగల బాపు, దాసరి ఉమ, సాంబమూర్తి, కాంగ్రెస్ కార్పొరేటర్లు కొలిపాక సుజాత, మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తఫా, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సత్కారం

కోల్‌సిటీ, ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కోర్టు భవనాన్ని త్వరితగతిన నిర్మించాలన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు కే సౌజన్యరావు, కొప్పుల శంకర్, మాదాసు శ్రీనివాస్, పెండ్యాల మహేష్, వరలక్ష్మి, ప్రసన్న, గుర్రాల రాజేందర్, దూడపాక లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో నోడల్ బృందం విచారణ



విచారణ జరుపుతున్న ఎంఈవో రాజయ్య, నోడల్ బృందం

ఓదెల ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో పలు అభియోగాలపై ఎంఈవో రాజయ్యతో పాటు, నోడల్ బృందం సోమవారం విచారణ నిర్వహించారు. పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే అభియోగం, అలాగే మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉన్నాయని, నాణ్యత లేని భోజనాన్ని వడ్డిస్తున్నారనే ఆరోపణపై అధికారులు విచారణ నిర్వహించారు. అలాగే ఇచ్చిన సెలవులన్నీ సర్వీస్ పుస్తకాల్లో మూడు నెలల పాటు నమోదు చేయకుండా జాప్యం చేస్తున్న వైనం అధికారుల దృష్టికి వచ్చింది. లీవ్ ఎకౌంట్లను వెంటవెంటనే సర్వీస్ పుస్తకాల్లో నమోదు చేయాల్సి ఉండగా, దానిపై ఎలాంటి జాగ్రత్తలు వహించకుండా నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో పలు విషయాలపై ప్రిన్సిపాల్ జావేద్‌ను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అలాగే అవినీతి ఆరోపణలు వచ్చినందున వీటిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వ హించారు. బస్సుపాస్‌లకు సంబంధించిన అంశంలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై విద్యార్థులను స్వయంగా అధికారులు విచారించారు. అలాంటిది ఏమీ లేదని విద్యార్థులు రాతపూర్వకంగా వాసి ఇచ్చారు. గతం నుంచి ఉన్నతాధికారులు హెచ్చరిక నోటీసులతోనే సరిపుచ్చుతుండడంతో పలు తప్పులు పదేపదే జరుగుతున్నాయని అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. లీవ్ ఎకౌంట్లో సర్వీస్ పుస్తకాల్లో నమోదు విషయంలో పూర్తిస్థాయిలో విచారణ మిగిలి ఉందని, ఎంఈవో రాజయ్య తెలిపారు. అలాగే విచారణ చేసిన అనంతరం నివేదికలను డీఈవో మాధవికి సమర్పించనున్నట్లు బృందం తెలిపింది. కార్యక్రమంలో ఎంఈవో రాజయ్య, నోడల్ అధికారి రమేష్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు సాంబయ్య, పద్మ పాల్గొన్నారు.

రేషన్‌షాపును తనిఖీ చేసిన అధికారులు

మంథని, ఏప్రిల్ 15: పట్టణంలోని రేషన్ షాపును జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. స్థానిక దొంతులవాడలో ఉన్న రేషన్ డీలర్ గుండా ధనలక్ష్మి-పురుషోత్తంకు చెందిన రేషన్ షాపు నంబర్ 3606034ను జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, మంథని రెవెన్యూ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మంథని ఆర్ఐల బృందం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. మూడు రోజుల క్రితం తనిఖీకి వచ్చిన అధికారులకు గతంలో సీజ్ చేసిన 20 క్వింటాళ్ల బియ్యం స్టాక్ చూపించని సదరు డీలర్ ఆ సీజ్ చేసిన బియ్యాన్ని స్మగ్లర్లకు విక్రయించినట్టుగా పలు ఫిర్యాదులు రావడంతో సోమవారం మరోసారి స్టాక్ నిల్వలపై వారు ఆరా తీసినట్టు సమాచారం.

కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు



జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌కు పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

పెద్దపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన జూలపల్లి జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ సింగిల్ విండో చైర్మన్లు మాదాసు నర్సింహారెడ్డి, చదువు రాంచంద్రారెడ్డి, అసెంబ్లీ ఎన్నికల ముందు బీఎస్పీలో చేరిన పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం పెద్దపల్లి నిర్వహించిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో అనేక మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బహుజన సమాజ్‌వాది పార్టీలో నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష సమక్షంలో పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి చేరిన విషయం తెలిసిందే. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షు డు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఆయనతో పాటు దాసరి ఉష, దాసరి హను మయ్య కూడా చేరారు. దీంతో జడ్పీటీసీ బండారి రామ్మూర్తి తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరలేదు. దీంతో ఆయనతో ఎమ్మె ల్యే విజయరమణారావు మంతనాలు జరపడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేందుకు రెండు, మూడు రోజులు మిగిలి ఉండగానే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీని వీడడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బే అని చెప్పవచ్చు.

రైతులను పట్టించుకోని బీఆర్ఎస్, బీజేపీ

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 15: తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు సమస్యలపై ఏనాడు పట్టించుకోలేదని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమాశేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు బేడీలు వేశారని, బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలో 13 నెలల పాటు రైతుల నిరసనపై ఉక్కుపాదం మోపి 72 మంది చావుకు కారణం అయ్యింది నిజం కాదా అని ప్రశ్నించారు. పదేళ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు పండించిన పంట కొనుగోళ్లలో క్వింటాల్‌కు 12 నుంచి 14 కేజీల కోత పెట్టారన్నారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల పక్షాన దీక్ష చేపట్టడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పార్టీ చివరి ఆయకట్టు నీరందించి రైతులు వేసిన పంటలు నష్ట పోకుండా చూశామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు చేశామని, పార్లమెంటు ఎన్నికల అనంతరం అ ఒక్కటి కూడా అమలు చేసి చూపెడుతామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీలు ప్రకటించందన్నారు. అందులో రైతులకు, యువకులకు, నిరుద్యోగులకు, కార్మికులకు, మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపాదికన నిధులు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నైపుణ్య కేంద్రం ఏర్పాటు చేసి 200 మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లకు బైపాస్ రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలు జరుగుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. రాజకీయ అనుభవమున్న కుటుంబం నుంచి రాజకీయ అరంగేంట్రం చేస్తున్న గడ్డం వంశీని గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో గడ్డం వంశీని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైస్‌మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతుల నుంచి అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. రైతులను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. మానేరు ఇసుక తీయడం వల్ల నదీ పరివాహక పంటలు నష్టపోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. ఇక నుంచి మానేరు ఇసుక తీసేదే లేదని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబీలో ముంచిందన్నారు. రాం మందిరం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. అన్ని కుల మతాలను కలుపుకుపోయేదే కాంగ్రెస్ పార్టీ అని ఆయన పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ బానిస పాలన నుంచి బంధీలుగా ఉన్న మనకు విముక్తి కల్గిందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావాల్సిందేనన్నారు.

పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ మాట్లాడుతూ కాక వెంటకస్వామి తన 70 ఏళ్ల రాజకీయ చరిత్రలో కార్మికులు, ఉద్యోగులకు పించన్ విధానం ప్రవేశ పెట్టాడన్నారు. తెల్ల రేషన్ కార్డుల జారీ చేశాడని, అలాగే హైదరాబాద్‌లో 75 వేల గుడిసెలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాడని వివరించారు. తొలి దశ, మలి దశ తెలంగాణ సాధన ఉద్యమంలో పోరాటం చేశాడని గుర్తుకు చేశారు. కేసీఆర్, కేటీఆర్ రాష్ట్రాన్ని దోచుకున్నారని, ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు ఆటో డ్రైవర్లు, ఇతరత్ర కూలీలుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పాఠశాలలకు బెంచీలు అందజేసినట్లు, అలాగే నీటి ఎద్దడి ఉన్న ప్రతి చోట బోరింగ్‌లు వేయించామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, అరెపల్లి మోహన్, జనక్‌ప్రాసాద్, అంతటి అన్నయ్య గౌడ్, మినపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, బుషనవేన సురేష్‌గౌడ్, అక్బర్‌అలీ, కల్వల శ్రీనివాస్, గోపగాని సారయ్యగౌడ్, బూతగడ్డ సంపత్, గుండేటి ఐలయ్య యాదవ్, తులా మనోహర్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ఎవరు దోచుకుపోతున్నారో చెప్పాలి

మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించిన జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని, ఏప్రిల్ 15: అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాత ముత్తాతల ఆస్తిలాంటి ఇసుకను దోచుకుపోతున్నారని మాట్లాడిన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి ఈనాడు ఇసుకను ఎవరు దోచుకుపోతున్నారో ప్రజలకు జవాబు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు డిమాండ్ చేశారు. ఇసుక లారీల ఓవర్ లోడ్‌తో ఛిద్రమైన మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిని సోమవారం పుట్ట మధు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అనేక అబద్దాలు చెప్పిన మంత్రి ఈనాడు ఇసుక అక్రమ తరలింపుపై ఎందుకు స్పందించలేదన్నారు. మంత్రి ఎన్నికల్లో వంద కోట్లు ఎట్లా ఖర్చు చేశాడని, అంత పెద్ద డబ్బు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికారంలో లేనపుడు మరో రకంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఇసుక క్వారీలు, లారీలు తనవేనని ప్రచారం చేశారని, ఈనాడు వందల కొద్ది అక్రమంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలన్నీ ఎవరివని ప్రశ్నించారు. వంద టన్నుల బరువు వెళ్లినా చెదిరిపోకుండా రోడ్ల నిర్మాణం చేస్తే నాలుగు నెలలు గడవ ముందే వంద టన్నుల కంటే ఎక్కువ బరువుతో ఇసుక లారీలు వెళ్తున్నాయని, దీంతో రోడ్డు మొత్తం పగిలిపోతుందన్నారు. అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తే అక్కడక్కడ ఒకటి రెండు లారీలను పట్టుకుంటున్నారని, కానీ వందల కొద్ది లారీలు ఓవర్‌లోడ్ వెళ్తున్నాయని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలో పదేళ్ల పాటు ప్రజలకు అనేక సేవలు, అభివృద్ధి చేసినా మూడు ఓట్లు లేని కుటుంబం ఇంత పెద్ద సమాజానికి మాయమాటలు, అబద్దాలు చెప్పి అధికారం చెలాయిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నీళ్ల కింద ఇసుక వృధాగా పోవద్దని, కేసీఆర్ సర్కార్ ఇసుక తీసి ప్రజల అవసరాలకు వినియోగించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు డబ్బులు జమ చేసింద న్నారు. ఈనాడు మాత్రం ఇసుక క్వారీలు, లారీల డబ్బులు కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయని, నియోజకవర్గంలో ఇసుక, బియ్యం, స్క్రాప్, బెల్లం దందాలకు కాంగ్రెస్ నాయకులు ఇంచార్జీలుగా వ్యవహరిస్తే మంత్రి సోదరుడు నాయకత్వం వహిస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా తనపై చేసిన ఆరోపణలు రుజువు చేయడం లేదని, ఇసుక క్వారీలు, లారీలు ఆగడం లేదని, అధికారంలో ఉండి ఒక్క మంచి హోదాలో ఉండి కూడా ఇసుక రవాణాను ఎందుకు ఆపుతలేరని ఆయన ప్రశ్నించారు. ఇసుక రవాణాను ఆపాలని సుల్తానాబాద్‌లో అన్ని పార్టీలు నాయకులు దీక్ష చేస్తున్నారని, అదే తరహాలో మంథనిలో కాంగ్రెస్ నాయకులు దీక్ష చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, కాయితి సమ్మయ్య, ఆసీఫ్‌ఖాన్, గోబ్బూరి వంశీలు ఉన్నారు.



ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న పుట్ట మధు

మానవాళికి రాముని జీవితం ఆదర్శం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 15: సమాజానికి, మానవాళికి రాముని జీవితం ఆదర్శమని, ప్రతిఒక్కరూ రామున్ని ఆదర్శంగా తీసుకోవాలని వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం అన్నారు. గోదావరిఖని శారదానగర్‌లోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సోమవారం శ్రీరామనవమి మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. ప్రతి ఉగాది నుంచి హనుమాన్ జయంతి వరకు దేశవ్యాప్తంగా శ్రీరామ మహోత్సవాలు విశ్వహిందూ పరిషత్ నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్క కుటుంబంలో రామాయణం యొక్క విశిష్టతను పిల్లలకు తెలియజేయాలని సూచించారు. మూడు నెలలుగా విశ్వహిత సేవా సమితి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకున్న మహిళ లకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే కుటుంబానికి, దేశానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంత గోరక్ష ప్రముఖ ఇసంపల్లి వెంకన్న, నగర కార్యదర్శి మేడగోని రవీందర్, జిల్లా సహ కార్యదర్శి బండ సమ్మన్న, సత్యం, జిల్లా కోశాధికారి నేరేడు కొండ వెంకటస్వామి, ఆరెల్లి జలంధర్, కొండపర్తి లింగన్న, సంపత్ చక్రపాణి, అంజన్న, కుట్టు శిక్షణ శిక్షకురాలు ఆరెల్లి మమత, భవాని, తిరుమల, లలితక్క, రజిత, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మల సత్యం

దొంగల బీభత్సం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఎల్లారెడ్డిపేట మండలం పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పదిరలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న కుంబాల మహేందర్‌రెడ్డి ఇంటి తాళం పగులకొట్టి బీరువా, సూట్‌కేస్, డ్రెసింగ్ టేబుల్‌ను ధ్వంసం చేశారు. అందులోని దుస్తులు, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. దేవుడి గదిలోకి వెళ్లి ఫొటోలను తొలగించారు. అరు బయట నిలిపిన స్కూటీ, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. మహేందర్‌రెడ్డి దుబాయిలో ఉండడంతో అతడి భార్య నిర్మల పిల్లలతో కలిసి ఈ నెల 10న ఇంటికి తాళం వేసి గల్ఫ్ వెళ్లింది. అల్మాస్‌పూర్‌లోని ఎల్లమ్మ ఆలయం ప్రధాన ద్వారం తాళం బద్దలుకొట్టిన దొంగలు హుండీని ధ్వంసం చేసి అందులోని రూ.10 వేల నగదు, అమ్మవారి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. హుండీని ఆలయం బయట పడేశారు. పక్కనే ఉన్న సంతోష్ హోటల్ షటర్ తాళం పగులకొట్టారు.రూ.20 వేల నగదు, విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ.10 వేల విలువైన సిగరేటు ప్యాకెట్లు, శీతల పానీయాలను ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోడాగ్ స్క్వాడ్, వేలిముద్రల నమూనాల సేకరణ బృందం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు తులాల బంగారం, 15వేల నగదు అపహరణ

కోరుట్ల: పట్టణంలోని మినిట్యాంక్ బాండ్ సమీపంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన గుండ్లోజీ రాజేందర్ ఇంటికి తాళం వేసి ఆదివారం రాత్రి కటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులకు వేసి ఉన్న తాళం పగుల గొట్టి ఉంది. దీంతో యజమాని రాజేందర్ ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో సామగ్రి చిందర వందరగా పడి ఉండి బీరువా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కిరణ్ కుమార్ క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. నాలుగు తులాల బంగారు అభరణాలతో పాటు బీరువాలో ఉన్న రూ. 15000 నగదు అపహరణకు గురైనట్లు రాజేందర్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 15: మండలంలోని చిన్న కలువలో జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిన్న కలువల గ్రామానికి చెందిన గాంట్ల తిరుపతి (40) స్థానికంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అందులో నష్టం రావడంతో ఒకరి వద్ద గుమస్తాగా పనిచేశాడు. ఆర్థిక సమస్యలతో భార్య భర్తలు తరుచూ గొడవ పడేవారు. సోమవారం కూడా గొడవ జరగడంతో తిరుపతి బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటికి రావడంతో అసలే ఆర్థిక ఇబ్బందులు ఉండగా మళ్లీ మద్యం తాగి రావడమేంటని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన తిరుపతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితమే మొదటి భార్యతో విడాకులు కాగా రజితను రెండో పెళ్లి చేసుకున్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



రమేష్ (ఫైల్)

ముత్తారం ఏప్రిల్ 15: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన మొగిలి రమేష్ అలియాస్ రవి(45) అనే వ్యవసాయ కూలీ వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. మానేరు అవతల గల భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోట శివారులో గల పొలం వద్దకు మోటారు వేద్దామని ఉదయం వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా మానేరులో కిందపడి ఉన్నాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు రమేష్‌కు భార్య రాజేశ్వరి, కూతురు, కొడుకు ఉన్నారు.

నిథమ్‌లో టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) గచ్చిబౌలి, హైదరాబాద్‌లో టూరిజం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత నిథమ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందులో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జాతీయస్థాయి విద్యావిధానంతో నిథిమ్‌లో ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తుందని, అడ్మిషన్, ఇతర వివరాలకు జిల్లా పర్యాటకశాఖ కార్యాలయం, కరీంనగర్‌లోగానీ జిల్లా పర్యాటకశాఖ అధికారి 94408 16070లో సంప్రదించాలని సూచించారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 51 మంది రైతులు 644 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 18 క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

భక్తోత్సవం ప్రారంభం

అశ్వ వాహనంపై స్వామివారల విహారం



స్వామివారి ఉత్సవమూర్తులు

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీరామ భక్తోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు మూడు రోజులపాటు నిర్వహించే శ్రీరామ భక్తోత్సవంలో తొలిరోజు ఉదయం ఆలయ స్థానా చార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వస్తిపుణ్యా వచనము, గౌరీపూజ, పంచగవ్య మిశ్రణం, ఋత్విక్ వరుణము, యాగశాల ప్రవేశం, మండపారాధన నిర్వ హించారు. అర్చకుల కు వరుణి అందజేశారు. అంతకుముందు రాజరాజేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకా దశ రుద్రాభిషేకం, శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఉపనిషత్ ద్వారా అభిషేకం చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. రాత్రి పార్వతీరాజ రాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీఅనంత పద్మనాభస్వామి వారలను అశ్వ వాహనంపై ఊరేగించారు. ఉత్సవాలలో భాగంగా ఈ నెల 17వ తేదీ బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ చంద్రస్వామి వారల దివ్య కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ చైర్మన్ అతిథిగృహం ముందుభాగంలో వేదికతోపాటు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



అర్చకులకు వరుణి అందజేస్తున్న ఆలయ స్థానాచార్యులు



అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. పెద్దసంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



బారులుదీరిన భక్తులు

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
ముగ్గురికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 15: శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహ దారిపై సోమవారం ఉదయం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి ప్రభాకర్ కారులో అతని బంధువు గోనెల సుదర్శన్, గోనెల శ్రీవర్షినిలు మానకొండూర్ మండలం కొండపలకలలో దశదిన కార్యక్రమానికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున తిరిగి రాంపూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలోనే కేశవపట్నం శివారులో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ గోపికృష్ణలు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుదర్శన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన శ్రీకాంత్, శంకరపట్నం మండలం చింతగుట్టకు చెందిన మేఘన ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టినట్లు తెలిపారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు.

20 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిబిరాల నిర్వహణ

18వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్15: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అనుబంధ సంఘం అయిన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్ శిక్షణ శిబిరాలను కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అండర్-14, 16, 19, 23 వయస్సు విభాగాలలో బాలబాలికలకు ఈ ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా శిక్షణ కేంద్రాల్లో నిష్ణాతులైన కోచ్‌లు, ట్రైనర్లను నియమిస్తున్నామని చెప్పారు. అలాగే క్రీడాకారుల కోసం క్రికెట్ నెట్లతో పాటు జంబోకిట్లు, అందుబాటులో ఉంచామన్నారు.

ఈ శిక్షణ శిబిరాలలో ప్రతిభ చాటే క్రీడాకారులను హెచ్‌సీఏ, కేడీసీఏల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 9 వరకు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆరు సంవత్సరాల తరువాత ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాలలో పాల్గొనే సదావకాశాన్ని క్రీడా కారులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి గల బాల బాలికలు తమ పేర్లను www.hycricket.org వెబ్‌సైట్‌లో ఈనెల 16 నుంచి 18 తేదీ సాయంతం 6 గంటల వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20న ప్రారంభమయ్యే ఉచిత శిక్షణ శిబిరాలు మే నెల 20వరకు నెల రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులకు హెచ్‌సీఏ సహకారంతో ఉదయం పౌష్టికాహారాన్ని అందించనున్నామన్నారు. అలాగే త్వరలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో కెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు ఉచిత క్రికెట్ శిబిరాల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులు తమ సందేహాలను నివృత్తికి 80087 29397 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో కేడీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం మురళీధర్‌రావు, ఉపాధ్య క్షుడు పి మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్, క్రికెట్ కోచ్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేడీసీఏ అధ్యక్షుడు ఆగమ్‌రావు

ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాలపై నిర్లక్ష్యం

● ఇరవై రోజుల క్రితం చర్యలకు ఆదేశం ● ఎట్టకేలకు కొండగట్టు ఉద్యోగులకు మెమోలు

మల్యాల, ఏప్రిల్ 15: దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలపై గత ఇరవై రోజులుగా స్తబ్దుగా ఉన్న అధికారులు కదిలారు. కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో కొన్నాళ్ల క్రితం విధులు నిర్వహించిన ఏఈవో బుద్ది శ్రీనివాస్‌తో పాటు పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్‌కు సోమవా రం ఈవో చంద్రశేఖర్ మెమొలు జారీ చేశారు. ఇక్కడి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ చారీ దేవస్థానానికి సంబంధించిన టెండర్ల సొమ్ములు దాదాపు రూ.52లక్షలు దుర్వినియోగం చేశారనే దానిపై అప్పట్లోనే అప్పటి ఈవో వెంకటేష్ శ్రీనివాస్‌చారీతో పాటు పర్యవేక్షణ అధికారులకు చార్జీ మెమోలు అందించారు. అనంతరం శ్రీనివాస్ చారీని సస్పెండ్ చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదు చేశారు. కొన్నాళ్లకు ఏడీసీ జ్యోతి సొమ్ముల దుర్వినియోగంపై విచారణ జరిపిన అనంతరం పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వహించినందుకు గాను గత నెల 23న ఈవోపై దేవాదాయశాఖ క మిషనర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈవోపై చర్యలు తీసుకుంటూనే సదరు పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యంపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇక్కడి అధికారులు కమిషనర్ ఆదేశాలపై ఇరవై రోజులు గడిచినప్పటికీ కమిషనర్ ఆదేశాలపై ముందుకు కదలకపోగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎట్టకేలకు సోమవారం ముగ్గురు అధికారులకు మెమోలు అందించారు. అంజన్న సొమ్ముల దుర్వినియోగంపై గత పదేళ్ల రికార్డుల తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.

జమ్మికుంటలో మద్యం పట్టివేత

జమ్మికుంట, ఏప్రిల్ 15: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హనుమండ్లపల్లిలో ఓ వ్యక్తి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను సోమవారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఓ వ్యక్తి తన ఇంట్లో మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న బ్లూకోర్టు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. రూ.2,280 విలువ గల మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 15: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ బెల్ట్ షాపు యజ మానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ సోమవారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్ముతుండగా అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రూ. 30వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను సోమవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ముగ్గురు వాహనదారులకు ఐదు రోజుల జైలుశిక్ష, నలుగురు వాహనదారులకు మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం రూ. 12 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 14 మంది వాహనదారులకు 23, 500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 15: మండలంలోని మల్యాల గ్రామ సమీపంలో సోమవారం లారీ(టీఎస్ 24 7272)లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఎస్సై ఓంకార్ యాదవ్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అంబాల రవి అక్రమంగా ఇసుక వ్యాపారం నిర్వహించేవాడని, అందులో భాగంగానే అర్ధరాత్రి సమయంలో గుంపుల గ్రామ సమీపంలోని మానేరు నది వద్దకు వెళ్లి అక్కడ జేజ శ్రీనివాస్ జేసీబీ సహాయంతో ఇసుకను లోడ్ చేసి, లోడింగ్ పూర్తయిన తర్వాత అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌తోపాటు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ చెందిన ఎండీ షారుక్ (26) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఫాజుల్ నగర్‌కు చెందిన షారుక్ కుటుంబం కొంతకాలంగా వేములవాడలోని అర్బన్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి శాత్రాజుపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో సాయిరక్ష సమీపంలో రహదారి మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొట్టాడు. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, 11 నెలల వయస్సు ఉన్న కూతురు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్రాక్టర్ చోరీలకు పాల్పడుతున్న నిందితుల పట్టివేత

● ముగ్గురితో పాటు బాలుడి అరెస్ట్ ● ట్రాక్టర్, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ల స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మల్యాల, ఏప్రిల్ 15: వ్యవసాయంతో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని ఎక్కువగా సంపాదించాలనే అత్యాశతో ట్రాక్టర్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఓ బాలుడిని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రాజారంలో ఇటీవల ట్రాక్టర్ ఎత్తుకెళ్లిన దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లికి చెందిన సింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో బాలుడు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షామ్‌నగర్‌కు చెందిన పెంబి రాజులు వ్యవసాయం, కూలీపనులతో వచ్చే ఆదాయం సరిపోక ట్రాక్టర్‌ల దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నారు. ఇందులో భాగంగా కొన్నాళ్ల క్రితం చంద్రశేఖర్‌రెడ్డి, రాజు గుడిహత్నూర్‌లో ట్రాక్టర్ దొంగతనం చేయడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మళ్లీ దొంగతనాలకు జగిత్యాల ప్రాంతానికి వచ్చిన నలుగురు రెక్కీ నిర్వహిస్తూ మల్యాల మండలం రాజారం శివారులో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ముందు నిలిపి ఉన్న రెండు ట్రాక్టర్లలో ఒక్క దాన్ని ఎత్తుకెళ్లారు. ఆ ట్రాక్టర్‌ను ఎవరూ గుర్తు పట్టకూడదని కొండగట్టు ప్రాంతంలోని గుట్టలలో రంగులు మార్చి సోమవారం తమ గ్రామానికి తీసుకెళుతుండగా ముగ్గురు నిందితులతో పాటు బాల నేరస్థుడిని కొండగట్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద ట్రాక్టర్, ట్రాలీ, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కోర్టులో హాజరుపరచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్‌రహీం, కుమారస్వామి పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 15: భూగర్భ జలాలను పెంపొందించడానికి ఇంటి యజమానులు తమ ఇంటి పరిసరాల్లో తప్పకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వర్షం నీరు, వృథా నీరు భూగర్భంలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సూచించారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని పబ్లిక్ బోర్లను పరిశీలించారు. ఫైటింక్లయిన్‌కాలనీ అల్లూరులో బోర్లను పరిశీలించారు. భూగర్భ జాలమట్టం పడిపోవడం వల్ల ఎక్కువ సేరు నీరు రావడం లేదని, నీటి మట్టం పెంపొందించడానికి బోర్‌వెల్ పరిసరాల్లో ఇంకుడు గుంతలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో నిర్మించిన అన్నీ ఇంకుడు గుంతలను వినియోగంలోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. నగరపాలక సంస్థ వేసవి కార్యాచరణలో భాగంగా బోర్‌వెల్స్ మరమ్మతుకు అవసరమైన విడిభాగాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచామన్నారు. బోర్‌వెల్ పని చేయకపోతే కంట్రోల్ రూమ్ 9392483959కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



బోరింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

నత్తనడకన బండలవాగు ప్రాజెక్టు పనులు



నీరులేక వెలవెల బోతున్న బండలవాగు



పైపులైను కోసం తవ్విన కందకం

పాలకుర్తి, ఏప్రిల్ 15: పాలకుర్తి మండలం కుక్కలగూడుర్ వద్ద బండల వాగు ప్రాజెక్టు పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దంచి కొడుతున్న ఎండల తీవ్రతకు భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నేడు బండల వాగు ప్రాజెక్టులో చుక్క నీరు లేకుండాపోయింది. గతంలో రామగుండం ఎమ్మెల్యేలుగా గెలిచిన సోమారపు సత్యనారాయణ, కోరుకంటి చందర్ పాలకుర్తి మండలంలో ఏ కార్యక్రమం నిర్వహించినా బండలవాగు ప్రాజెక్టును త్వరలో పూర్తిచేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగు నీరు అందిస్తామని హామీలు ఇచ్చారు. ఇటీవల రామగుండం ఎమ్మెల్యేగా గెలిచిన రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సైతం గతంలో బండలవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం పాదయాత్రలు చేయడంతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను సైతం ఇక్కడి బండలవాగు ప్రాజెక్టు సందర్శనకు తీసుకువచ్చారు. కాంగ్రెస్ వాది గంట సత్యనారాయణరెడ్డి సైతం గతంలో బండల వాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం గుడిపల్లిలో ఒకరోజు మౌనదీక్షను సైతం చేపట్టారు. అయినా బండల వాగు ప్రాజెక్టు పనులు నేటికి నత్తనడకనే కొనసాగడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి బ్రాహ్మణపల్లి వద్ద నిర్మాణమవుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరగా పూర్తిచేసి డీ-83 కాలువకు ఉపకాలువగా ఉన్న 27 ఎల్ కింద ఉన్న 15 ఎకరాలు, 17 ఎల్‌తో కుక్కలగూడుర్ వద్ద ఉన్న బండల వాగు ప్రాజెక్టును నింపి దాని కింద 1250 ఎకరాల భూమికి సాగునీరు అందించాలని సూచించారు. కుక్కలగూడుర్, వేంనూర్ గ్రామాల శివారు ప్రాంతంలోని ఎల్లంపల్లి శ్రీపాదసాగర్ బ్యాక్ వాటర్ వద్ద పంప్‌హౌస్ నిర్మించి అక్కడి నుంచి మోటర్ల ద్వారా పైపులైన్లతో సుమారు ఐదు కిలోమీటర్ల దూరాన ఉన్న బండలవాగు ప్రాజెక్టుకు నీరును తరలించాలనే లక్ష్యంతో గత సవంత్సరం ఏప్రిల్‌లో మొదలు పెట్టిన పనులు నేటికి శాతం కూడా పూర్తి కాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవచూపి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వం

పాలకుర్తి, ఏప్రిల్ 15: రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదని గమనించిన ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఛీత్కరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టినా బీఆర్‌ఎస్ నాయకుల్లో మార్పురాకపోవడం విడ్డూరంగా ఉందని డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య, పుట్నూర్ ఎంపీటీసీ గంగాధరి రమేష్ గౌడ్ అన్నారు.. సోమవారం స్థానిక ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంథనిలో పుట్ట మధు, రామగుండంలో కోరుకంటి చందర్ తమ తమ స్వార్థ ప్రయోజనాల కోసం పరితపించారే తప్ప ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. చందర్ ఆదివారం బసంత్‌నగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. అనునిత్యం ప్రజలతో మమేకమై వారి అభివృద్ధి కోసం పరితపిస్తున్న తమ నాయకులపై, రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న చందర్‌కు పాలకుర్తి మండలంలో తిరిగే నైతిక అర్హత లేదన్నారు. ఎన్నికలకు ముందు బండలవాగు ప్రాజెక్టును పూర్తి చేయకుండా తాను ఓట్లు అడుగనని వాగ్దానాలు చేసిన చందర్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తాడని వారు చందర్‌ను విమర్శించారు. అతిత్వరలో బండల వాగు ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నాడని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి శంకర్, వేల్పుల రాజ్‌కుమార్, అరకాల సతీష్, మల్లెత్తుల శ్రీనివాస్, నారా సత్తయ్య, తువ్వ సతీష్ యాదవ్, గండికోట వెంకటేష్, తిప్పని చంద్రమొగిళి, భూతగడ్డల రమేష్, శంకర్‌నాయక్, షేక్‌లాల్ నాయక్, మునిగాల ప్రసాద్‌గౌడ్, కేశిరెడ్డి భూమ్‌రెడ్డి, సాగర్ గౌడ్, కాసార్ల కిరణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర సమ్మయ్య

సీతారాముల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

పాలకుర్తి, ఏప్రిల్ 15: మండలం పరిధిలోని బామ్లనాయక్ తండాలో సోమవారం సీతా రాముల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇటీవల అభయాంజనేయ స్వామి ఆలయాన్ని గ్రామస్తుల సహకారంతో నిర్మించారు. రానున్న శ్రీరామనవమి వేడుకలు జరుపుకునేందుకు గాను నూతన విగ్రహాలను నెలకొల్పారు. ఇందుకు తండా మాజీ సర్పంచ్ రాజునాయక్ ఆరు లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. అలాగే కొత్తపల్లె గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని నెలకొల్పారు. డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య లక్షా16 రూపాయలను విరాళంగా అందించారు. కార్యక్రమానికి హాజరైన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పూజలు నిర్వహించారు.

18న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ధర్మారం.ఏప్రిల్ 15: ఈ నెల 18న ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో జరగనున్న నియోజకవర్గస్థాయి సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి కోరారు. కార్యకర్తలు తప్పని సరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ చేయూత

కోల్‌సిటీ, ఏప్రిల్ 15: గోదావరిఖనిలోని ఒక కలర్ ల్యాబ్‌లో పనిచేస్తూ రెండునెలల క్రితం అనారోగ్యంతో మరణించిన సోఫియా బేగం కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం భరోసా నుంచి రూ.1.60 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. సోమవారం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, రాష్ట్ర మహిళా ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్మా తులసిలో సోఫియా ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. రాష్ట్ర సంక్షేమ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్, పోగుల విజయ్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆపన్నహస్తం

రామగిరి, ఏప్రిల్ 15: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కన్నాల రమేశ్‌కు సింగరేణి కార్మికుడు రేండ్ల కుమారస్వామి సోమవారం హైదరాబాద్ ఆసుపత్రిలో ఆర్థిక సహాయం అందజేశారు. కొంత కాలంగా పాంక్రియాసిస్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్సపొందుతున్న కన్నాల రమేశ్‌కు సింగరేణి కార్మికుడు రేండ్ల కుమారస్వామి 20 వేల రూపాయలను అందజేశారు.

సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా తరగతులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 15: ఎన్‌టీపీసీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాణి ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా శిక్షకుడు శ్రీనివాస్ విద్యార్థినిలకు కరాటేలో మెళకువలు నేర్పారు. బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసం శిక్షణా తరగతులు నిర్వహించినట్టు శ్రీనివాస్ పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమంలో హెచ్‌ఎం జయరాజ్, పీఈటీ రొమరోజ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఖని బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



మంథనిలో..

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం గోదావరిఖని బస్టాండ్ ఆవరణలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ ఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ఎలా స్పందించాలో తెలిపారు. చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు ఇవ్వరాదని, కాల్చిన సిగరెట్లు, అగ్గిపుల్లలు ఆర్పకుండా పడవేయరాదన్నారు. ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకున్నపుడు పరిగెత్తకుండా నేలపై దొర్లాలని, దుప్పటి చుట్టుకోవాలని సూచించారు. అనంతరం ఇంట్లో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఎలా మంటలు ఆర్పివేయాలో ఫైర్ సిబ్బంది చేసి చూపించారు. అగ్ని మాపక వారోత్సవాల గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం, సెక్యూరిటీ హెడ్ వలీ, ఫైర్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

మంథని: అగ్నిపమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసి బస్సు డిపో ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణ పై అధికారులకు, కార్మికులకు సోమవారం మంథని ఫైర్ స్టేషన్ అధికారుల బృందం అవగాహన కల్పించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే తీరు, అవి జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు జాగ్రత్తల పై ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ ఎన్. సదానందం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎం, ఫైర్ సిబ్బంది డీఓపీ వీ. కుమారస్వామి, ఎఫ్‌ఎం భాస్కర్, హెచ్‌జీ లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష

కోల్‌సిటీ, ఏప్రిల్ 15: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసులో బొతు గణేష్, కన్నూరి ఓదెలు అనే ఇద్దరికి గోదావరిఖని కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్టు ట్రాఫిక్ సీఐ వీ రాజేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు. మద్యం తాగి పట్టుబడిన 52మందిని గోదావరిఖని సెంకడ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ ముందు హాజరు పర్చగా ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల చొప్పున రూ.1.06లక్షల జరిమానా విధించారన్నారు. ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్టు సీఐ పేర్కొన్నారు.

గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు

ఓదెల ఏప్రిల్ 15: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. మండల కేంద్రానికి చెందిన గట్టు పెద్ద రాధమ్మ నాలుగు రోజుల నుంచి జ్వరం, తీవ్రమైన కీళ్ల నొప్పులతో మంచం పట్టింది. అలాగే ఇదే గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలు జ్వరం బారినపడి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు.

దీంతో ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. అలాగే పొత్కపల్లిలో నాలుగు రోజుల నుంచి కొందరు ప్రజలు జ్వరాలతో మంచం పట్టారు. దీంతో ప్రైవేట్ వైద్యం చేయించుకుని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. బయట తీవ్రమైన ఎండలు, మరో పక్క జ్వరాలు, కీళ్ల నొప్పులతో రోగులు సతమతమవుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొంరయ్య

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 15: సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు కార్మికవర్గానికి ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఓసీపీ-1 సైట్ ఆఫీస్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆర్జీ-3 కార్యదర్శి కొంరయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు గెలిచిన సంఘాలకు గుర్తింపు పత్రం ఇవ్వకపోడంతో కార్మిక సమస్యలు పరిష్కారానికి నోచుకోలవడం లేదని అన్నారు. గుర్తింపు పత్రం అందకున్నా అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారే తప్ప, ఇచ్చిన హామీల అమలుకు యాజమాన్యంపై ఒత్తిడి తేవడం లేదని అన్నారు. ఇన్నాళ్ళయినా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడంలో ఉన్న కుట్ర కోణం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని విమర్శలు గుప్పించిన వారే నేడు అదే పరిస్థితి ఉన్నా ప్రశ్నించకపోవడం శోచనీయమని రాజారెడ్డి అన్నారు. నాలుగేళ్ల కాలపరిమితితో గుర్తింపు పత్రం ఇవ్వాలని కోరడం అధికార దాహానికి నిదర్శనమని, ఎర్రజెండా పేరుచెప్పుకుని కార్మికుల హక్కులను తాకట్టుపెట్టవద్దని హితవు పలికారు. ఇప్పటికైనా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు కార్మికులకు న్యాయం చేసేలా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధంకావాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన పిట్ కమిటీని కార్మికులకు, అధికారులకు పరిచయం చేశారు. గేట్‌మీటింగ్‌లో పిట్‌కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. పిట్ సెక్రెటరీగా కే రాకేష్, సహాయ కార్యదర్శిగా సంతోష్, రిలే ఇంచార్జులుగా జగదీశ్వర్, నరేష్, కిషోర్‌లను నియమించారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా విజేందర్‌రెడ్డి, రవీందర్, సంపత్‌లు నియిమించినట్టు రాజారెడ్డి పేర్కొన్నారు.

గనుల నీటిని తాగునీటి కోసం వినియోగించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గనుల నుంచి వెలువడే నీటిని తాగునీటి కోసం వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. సోమవారం ఆయన అవకాశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణ్‌శ్రీతో కలిసి సింగరేణి బొగ్గు గనుల నుంచి పంప్ చేస్తున్న నీటిని తాగునీరుగా మలిచి సరఫరా చేసేందుకు గల అవకాశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న ఆర్జీ-1, ఆర్జీ-2, ఆర్జీ-3 గనుల నుంచి ప్రతి రోజూ దాదాపు 132 ఎంఎల్‌డీల నీరు పంపింగ్ చేస్తున్నామని, వీటిలో సింగరేణి అవసరాలకు వినియోగించుకున్న తరువాత దాదాపు 100 ఎంఎల్‌డీల నీటిని వ్యవసాయానికి విడుదల చేస్తున్నామని సింగరేణి అధికారులు వివరించారు. సింగరేణి ఆర్జీ-1 నుంచి నీరు విడుదలయ్యే ఎర్ర చెరువు, నల్ల చెరువు, ఆర్జీ-2 నుంచి నీరు విడుదలయ్యే జల్లారం వాగు, ఆర్జీ-3 నుంచి నీరు విడుదలయ్యే బొక్కల వాగు నుంచి నీటిని తాగునీటి సరఫరాకు మళ్లించేందుకు గల అవకాశాలపై ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సింగరేణి బొగ్గు గనుల నుంచి వచ్చే నీటిని ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పైప్‌లైన్ వ్యవస్థను వినియోగించుకుంటూ రామగుండం పట్టణం, పరిసర గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే అంశంపై సాధ్యాసాధ్యాలు గురించి ప్రతిపాద నలు రెండు, మూడు రోజుల్లో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఏవో ఆదిరెడ్డి, ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణచందర్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా జి శ్రీను, సింగరేణి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దార్థ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఫైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 15: సిద్దార్థ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. 2002-03 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. గత స్మృతులను తలచుకొని ఆడిపాడారు. ఈసందర్భంగా తమకు విద్య చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ టంగుటూరి రాజయ్య, ఉపాధ్యాయులు విజయ, అన్నపూర్ణ, కొంరయ్య, కృష్ణ, శ్రీనివాస్, కుమార్, అశోక్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రొటోకాల్ విస్మరించిన ఆర్జీ-3 జీఎం'

రామగిరి, ఏప్రిల్ 15: అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు ప్రొటోకాల్‌ను విస్మరించారని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్జీ-3 కన్వీనర్ బత్తుల శంకర్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాణిరుద్రమ దేవి క్రీడాప్రాంగణం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ నేతలను ముందుగా పిలిచి ముందు వరుసలో కూర్చోపెట్టారని విమర్శించారు. అసోసియేషన్ తరుపున ఒక్కరే రావాలని చెప్పిన జీఎం ఇంత మందిని ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. ఉన్నత పదవిలో ఉన్న జీఎంకు ఎస్సీ, ఎస్టీలు కనిపించడం లేదని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జాతి బిడ్డలకు చేదోడువాదోడుగా ఉండాల్సిన జీఎం అందుకు భిన్నంగా యూనియన్ నేతలకు పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 15: జిల్లాలో 10వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని మీడియముల ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు విక్రయించుటకు ఆసక్తి గల విక్రేతలు ఏప్రిల్26లోగా దరఖాస్తు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా సంచాలకుల ఆదేశాల ప్రకారం 2024-25 విద్యా సంవత్సరంలో అన్ని మీడియంలలో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు విక్రయించుటకు ఆసక్తి గల విక్రేతలు తమ దరఖాస్తుతో పాటు వెయ్యి రూపాయల డిడి జిల్లా విద్యాశాఖ అధికారి, పెద్దపల్లి పేరున 26 ఏప్రిల్ లోగా సమర్పించి అనుమతి పొందాలని అన్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

ఐకేపీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హనుమానాయక్

రామగిరి, ఏప్రిల్ 15: రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని సోమవారం ఆర్డీవో హనుమానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీటి వసతిలో భాగంగా చలివేంద్రం ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. ఆయన వెంటగా తహసీల్దార్ రాంచందరర్‌రావు, డీటీ రాకేష్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

'అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి'

మంథని, ఏప్రిల్ 15: సీతంపేట బ్రిడ్జి వద్ద ఇసుక క్వారీలపై దౌర్జన్యం చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తీర్థాల కొమురెల్లి మంథని పోలీసులకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మంథని నుంచి ఖమ్మంపల్లికి వెళ్లే దారిలో గాజునవేణి అరుణ్ అనే వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా వసూలు చేస్తూ రహదారిపై ఇబ్బంది పెడుతున్నారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామంలో రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా పచ్చ కామెర్లు వ్యాధి ప్రబలుతున్న దృష్ట్యా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థుల నుండి రక్త నమునాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్యఎంఎల్‌హెచ్‌పి సుష్మిత, హెల్త్ సూపర్‌వైజర్ ఎలిజబెత్ రాణి, ఏఎన్‌ఎం తిరుమల, ల్యాబ్ టెక్నిషియన్ సిద్ధ మధు, ఆశ కార్యకర్తలు అనురాధ, సునిత, శారద పాల్గొన్నారు.

కాటమరాజుకు తాటిముంజలతో అభిషేకం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని పెద్దకల్వల గ్రామంలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో తమ కులదైవమైన కాటమరాజుకు తాటిముంజలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షులు కోట కోమురయ్య మాట్లాడుతూ వేసవికాలంలో తాటిచెట్ల నుండి వచ్చే తాటిముంజలను కోసే ముందు కాటమరాజుకు ముంజలతో అభిషేకం చేసిన అనంతరం పూర్తిస్థాయిలో కోస్తామన్నారు. కాటమరాజుకు అభిషేకం చేయడం ద్వారా అధిక కల్లు ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షులు భూషణవేన నంబయ్య, కోట నంబయ్య, కోట సునిల్, కోమురయ్య, భూషణవేన పోచాలు, కోమురయ్య, కోట నారాయణ, సందీప్, శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

డీఎస్సీ మెటీరియల్ అందజేత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని హన్మంతునిపేట గ్రామానికి చెందిన మియ్యపురం దివ్య డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న క్రమంలో ఎగోలపు కుమార్‌గౌడ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు ఏగోలపు సదయ్యగౌడ్ విద్యార్థికి మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం పరశురాం, తీగల సతీష్, గుర్రం సతీష్, మ్యాడగోని శ్రీనివాస్, రాకేష్, రమేస్, తీగల రమేష్, సదయ్య, సంతోష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ప్రార్థనలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని రాఘవపూర్ దర్గా మీర్ షా వలీ గంధం ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మెబిన్ రాబోవు ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ రాష్ట్రంలో భారీ మెజార్టీతో గెలుపొందాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అసిఫ్‌ఖాన్, అష్ఫాక్, అబ్దుల్ మన్నన్, నిజాం, నజ్మోద్దిన్, కలీం, షఫిక్ అహ్మద్, సలీం పాల్గొన్నారు.

ఈజీఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్15: ఉపాధిహామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు సీపెల్లి రవీందర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్స్ కొందరు బినామీ పేర్లతో ఉపాధి హామీ పనిలో కొనసాగుతున్నారన్నారు. అర్హతలు ఉన్న సీనియర్ మేట్‌ను కాదని వారికి సంబంధించిన దగ్గర వ్యక్తులను పనిలోకి తీసుకొని ఫొటో క్యాప్చర్ చేయించడం, వివిధ పనులకు వాడుకోవడం జరుగుతుందన్నారు. పలు రకాలుగా బినామీలను ఉపయోగించుకొని అనేక అక్రమాలు పాల్పడుతున్నారన్నారు. దీనికి సంబంధించి పై అధికారులకు సమాచారం ఉన్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కూలీకి పని కల్పించకుండా తక్కువ మందితో ఉపాధిహామీ పనిని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని సీనియర్ మేట్‌లను విధుల్లోకి తీసుకొని ఉపాధి కల్పించి భద్రత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం పని నిర్వర్తించకపోవడం వలన సామాన్య కూలీలు తక్కువ కూలి పొందుతున్న నిరు పేదలు చాలామంది ఉన్నారన్నారు. కరోనా కాలంలో కరోనా సైతం లెక్క చేయకుండా జీత భత్యం లేకుండా రోజువారి కూలీతో ఉపాధి పనిని కొనసాగించి ఉపాధి హామీ పనిలో రాష్ట్రాన్ని రెండవ స్థానంలో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో మొగిలి, అనిల్, సంపత్ కుమార్, వినోద్, నారాయణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన టీ తాగిన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 15: నిత్యం రాజకీయాలతో బిజీబిజీగా గడిపే రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం రాత్రి స్థానిక అంబేద్కర్ చౌక్‌లోని రోడ్డు పక్కన గల ఓ హోటల్‌లో టిఫిన్ చేసి టీ తాగారు. మండలంలోని విలోచవరం గ్రామానికి వెళ్లి వస్తూ స్థానిక అంబేద్కర్ చౌక్‌లోని నాగరాజు స్వీట్ హౌజ్, టిఫిన్ సెంటర్ వద్ద ఆగి ఇడ్లి తిని టీ తాగారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానికులతో కాసేపూ ముచ్చటించారు.



హోటల్‌లో టీతాగుతున్న మంత్రి